

హాస్టళ్లలో అప్పల వడ్డన

సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో అప్పులు చేసి విద్యార్థుల ఆకలి తీర్చే దుస్థితి నెలకొంది. కొన్ని నెలలుగా బిల్లులు అందలేదు. - 8లో



వాలీబాల్ జిల్లా జట్ల ఎంపిక

ఎస్‌జీఎఫ్ అండర్–19 ఉమ్మడి చిత్తూరు జిల్లా బాలబాలికల జిల్లా జట్ల ఎంపిక పోటీలు తిరుపతిలో నిర్వహించారు. - 8లో



మళ్లీ అక్రమ కట్టడాల కూల్చివేత

వికృతమాలలో కాలువ పోరంబోకు భూముల్లో నిర్మించిన అక్రమ కట్టడాలను రెవెన్యూ అధికారులు మళ్లీ కూల్చివేశారు. - 8లో

న్యూస్‌రీల్

వైఎస్ జగన్ పర్యటనకు పోలీస్ 30 యాక్ట్ అమలు

తిరుపతి క్రైం: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తిరుమల శ్రీవారి దర్శనాన్ని భగ్నం చేసేందుకు అధికార కూటమి పార్టీలు కుయుక్తులు పన్నుతున్నాయి. ఇందులో భాగంగానే వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తిరుమల పర్యటనను అడ్డుకునేందుకు శతవిధాలా ప్రయత్నిస్తున్నాయి. ఈ క్రమంలో ఈనెల 25వ తేదీ నుంచి వచ్చే నెల 24వ తేదీ వరకు తిరుపతి జిల్లా వ్యాప్తంగా సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. వాస్తవానికి 25వ తేదీ పెట్టని పోలీస్ యాక్ట్ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనకు ఒక్క రోజు ముందే పెట్టామని పోలీసులు చెప్పడం గమనార్హం.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: శ్రీవారి ఆలయంలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 6 కంపార్ట్‌మెంట్లు నిండాయి బుధవారం సోమవారం అర్ధరాత్రి వరకు 77,939 మంది స్వామివారిని దర్శించుకోగా 22,668 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.50 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేస్తుంది. కేటాయించిన సమయాన్ని కంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలోకి అనుమతించబోమని అధికారులు తెలిపారు.

నేటి నుంచి ఎస్వీయూలో క్యాంపస్ ఇంటర్వ్యూలు

తిరుపతి సిటీ: ఎస్వీయూ కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి రెండు రోజుల పాటు క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ జీవీ రమేష్ బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రిన్సిపల్ నరసయ్య ఆధ్వర్యంలో ప్రముఖ ఎమ్ఎన్‌సీ కంపెనీ ప్రతినిధులు రెండు రోజుల పాటు క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారని తెలిపారు. ఎమ్మెస్సీ కంప్యూటర్స్, ఎంసీఏతో పాటు 2021కి ముందు కంప్యూటర్‌లో డిగ్రీ చేసిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసక్తి అర్హత గల అభ్యర్థులు ఎస్వీయూలోని కామర్స్ అండ్ కంప్యూటర్ సైన్స్ విభాగంలో ఉదయం 9గంటలకు అన్ని ధ్రువపత్రాలతో హాజరుకావాలని పేర్కొన్నారు.

జాబ్ మేళాకు విశేష స్పందన



ఎంపికైన నిరుద్యోగికి ధ్రువపత్రం అందజేస్తున్న పరిశ్రమల ప్రతినిధులు

గూడూరురూరల్: ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో గురువారం జరిగిన జాబ్‌మేళా కార్యక్రమంలో వివిధ బహుళజాతి కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించగా నిరుద్యోగ యువతీ యువకుల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ నాగరాజు మాట్లాడుతూ వివిధ కంపెనీల యాజమాన్యాలు నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించే క్రమంలో జాబ్‌మేళాను నిర్వహిస్తున్నాయన్నారు. ఈ క్రమంలో మేనకూరు, శ్రీసిటీలోని నాలుగు బహుళ జాతి కంపెనీల్లో ఉద్యోగాలు కల్పించేందుకు ఇంటర్వ్యూలు నిర్వహించారన్నారు. మేళాలో సుమారు 100 మంది యువతీ, యువకులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారని చెప్పారు. వీరిలో 47 మంది యువతీ, యువకులు అర్హత సాధించడంతో వారికి అక్కడికక్కడే ధ్రుపత్రాలను అందజేసి, వచ్చే నెల నుంచి ఉద్యోగాలకు హాజరుకావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రావణ్, ప్లేస్‌మెంట్ అధికారి గణేష్, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్రతినిధులు దేశయ్య, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

తిరుచ్చిపై సీతారాములు



బంగారు తిరుచ్చిపై విహరిస్తున్న స్వామివారు

చంద్రగిరి : పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో సీతా రామలక్ష్మణ సమేత హనుమంతులు వారు బంగారు తిరుచ్చిపై ఆలయ మాడ వీధుల్లో గురువారం భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక శ్రేణి డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గోపినాథ్, టెంపుల్ సూపరింటిండెంట్ రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు తిరుమలకు వైఎస్ జగన్

- రేపు శ్రీవారిని దర్శించుకోనున్న వైఎస్సార్ సీపీ అధినేత

సాక్షి ప్రతినిధి, తిరుపతి: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం తిరుమలకు విచ్చేయనున్నారు. అనంతరం రాత్రి తిరుమలలోనే ఆయన బస చేయనున్నారు. శనివారం ఉదయం ఆయన శ్రీవారిని దర్శించుకోనున్నారు. తిరుమల పవిత్రత, లడ్డూ ప్రసాదం విశిష్టతకు భంగం వాటిల్లేలా ఆరోపణలు చేసిన సీఎం చంద్రబాబుపై భక్తులు భగ్గుమంటున్నారు. బాబు చేసిన పాపాన్ని ప్రక్షాళన చేసేందుకు ఈనెల 28న రాష్ట్ర వ్యాప్తంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేయాలని మాజీ సీఎం పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం సాయంత్రం తిరుమలకు చేరుకోనున్నారు. గన్నవరం నుంచి విమానంలో బయలు దేరి, సాయంత్రం 4 గంటల ప్రాంతంలో రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో రాత్రి 7 గంటలకు తిరుమల చేరుకుంటారు. రాత్రికి తిరుమలలోనే బస చేసి శనివారం ఉదయం 10.30, 11.30 గంటల మధ్య శ్రీవేంకటేశ్వరుస్వామిని దర్శనం చేసుకుంటారు. దర్శనానంతరం అదే రోజు మధ్యాహ్నం 1.30 గంటల ప్రాంతంలో తిరుగు ప్రయాణమవుతారని మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పీఏ నాగేశ్వర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. తమ అభిమాన నేత తిరుమలకు వస్తున్నారని తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆయనకు ఘన స్వాగతం పలికేందుకు సిద్ధమయ్యారు.





అశేష జన వాహిని మధ్య అమ్మవారి నగరోత్సవం (ఇన్‌సెట్) విశేషాలంకరణలో పోలేరమ్మతల్లి



భక్తజన గిరి

అమ్మా...పోలేరు తల్లీ.. కరుణించు మాయమ్మ..కాపాడమ్మా.. జైజైజై పోలేరు తల్లీ.. అమ్మలగన్నమ్మ మాయమ్మ...పోలేరమ్మతల్లీ.. అంటూ భక్త జనం వెంకటగిరి జాతరకు పోటెత్తింది. తెలుగురాష్ట్రాలతో పాటు, దేశ విదేశాల దారులన్నీ గిరి వైపు మళ్లాయి. వాహనాలన్నీ గిరి బాట పట్టాయి. చిన్నా, పెద్దా అందరూ అమ్మ దర్శనం కోసం వెంకటగిరికి చేరుకున్నారు. రాష్ట్ర పండుగ అయిన పోలేరమ్మ జాతరలో పాల్గొని, అమ్మను దర్శించుకుని ఆధ్యాత్మిక తన్మయత్వం పొందారు. గురువారం జరిగిన నగరోత్సవంతో జాతర ముగిసింది.

- పోలేరమ్మ జాతరకు పోటెత్తిన భక్తులు
- కిక్కిరిసిన వెంకటగిరి.. ముగిసిన జాతర

సైదాపురం(వెంకటగిరి): పట్టణంలో ఈ నెల 25వ తేదీ రాత్రి నుంచి ప్రారంభమైన పోలేరమ్మ జాతర గురువారం జరిగిన నగరోత్సవం, నిమజ్జనంతో ముగిసింది. జాతరకు ఇతర రాష్ట్రాలతో పాటు దేశవిదేశాల నుంచి కూడా లక్షలాది మంది భక్తులు విచ్చేశారు. ఉదయం నుంచి పోలేరమ్మ తల్లిని దర్శించుకునేందుకు బారులు తీరారు. దీంతో ప్రత్యేక క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. సుమారు 2 లక్షల మందికి పైగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఉన్నతాధికారుల పర్యవేక్షణలో..

పోలేరమ్మ జాతర రాష్ట్ర పండుగ కావడంతో కలెక్టర్ ఎస్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బారాయుడు, ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణతో పాటు అధికారుల పర్యవేక్షణలో జాతర ప్రారంభమైంది. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులకు క్యూల ఏర్పాటుతో పాటు చలువ పందిళ్లు వేశారు. భక్తులకు తాగునీటితోపాటు మజ్జిగ ప్యాకెట్లను అందజేశారు.

సారె సమర్పణ

గురువారం మధ్యాహ్నం వెంకటగిరి రాజా కుటుంబీకుల సర్వజ్ఞకుమార యాచేంద్రతోపాటు పలువురు అమ్మవారికి సంప్రదాయబద్ధంగా సారెను సమర్పించారు. అంతకుముందు వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పలువురు వైఎస్సార్‌సీపీ నేతలు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

సంప్రదాయబద్ధంగా బలి..పొలి

అమ్మవారికి సంప్రదాయ ప్రకారం బలి, పొలి కార్యక్రమాలు జరిగాయి. జాతరలో సంప్రదాయబద్ధంగా దున్నపోతును బలిచ్చి వెలిగించిన గండదీపం అమ్మవారి నిమజ్జనం పూర్తయ్యేవరకూ ఆరిపోకుండా దుప్పటి కప్పి ఉంచారు. తరువాత గ్రామ పొలిమేరల్లో నాలుగు దిక్కులా పొలి చల్లారు.

పట్టువస్త్రాల సమర్పణ

జాతర సందర్భంగా రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అమ్మవారికి సంప్రదాయ బద్ధంగా పట్టువస్త్రాలు సమర్పించారు. వీరికి ఆలయ ఈఓ శ్రీనివాసులరెడ్డి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పోలేరమ్మతల్లి జాతరలో అమ్మవారిని దర్శించుకునేందుకు పట్టువస్త్రాలు తీసుకొచ్చిన దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి జాతరలో చోటుచేసుకున్న చెదురుమదురు ఘటనలపై అసహనం వ్యక్తం చేశారు.

ఘనంగా నగరోత్సవం

సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన రథంపై పోలేరమ్మను కొలువుదీర్చి నగరోత్సవం నిర్వహించారు. ఆలయం మండపం నుంచి ప్రారంభమైన ఊరేగింపు రాజావీధి, కాశీపేట సెంటర్, పాత శివాలయంవీధి మీదుగా అమ్మవారి నిష్క్రమణ మండపం వరకు సాగింది.



మిద్దెల పైనుంచి అమ్మవారిని తిలకిస్తున్న భక్తులు



వెయ్యి కళ్ల దుత్తలతో భక్తులు



క్యూలో వేచి ఉన్న భక్తులు

అమ్మవారు కొలువు దీరారిలా..

పోలేరమ్మతల్లి జాతరలో భాగంగా బుధవారం అర్ధరాత్రి మెట్టినిల్లు అయిన జీనుగులవారి వీధి నుంచి వేకువ జామున 4 గంటలకు అమ్మవారి ని ఊరేగింపుగా తీసుకుని వచ్చి పోలేరమ్మ గుడి వద్ద ప్రత్యేకంగా నిర్మించిన మండపంలో ఏర్పాటు చేసిన చలువ పందిరిలో నిలుపు చేశారు. తెల్లవారు జామున నుంచి భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించారు. ఉదయం మందకొడిగా సాగిన భక్తులు 9 గంటల నుంచి అధిక సంఖ్యలో బారులు తీరారు. దీంతో ఆలయం వద్ద భక్తుల రద్దీ నెలకొంది. ఎర్రటి ఎండను సైతం లెక్కచేయకుండా భక్తులు క్యూలో వేచి ఉండి అమ్మవారిని దర్శించుకున్నారు. ఉచిత దర్శనంతోపాటు రూ.100, రూ.300 టికెట్లను కొనుగోలు చేసిన భక్తులు పాత బస్టాండ్ మీదుగా క్యూలో అనుమతించారు. అయితే ఈ ప్రాంతాల్లో భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో ఎండ తీవ్రతను తట్టుకోలేక కొందరు క్యూ లో స్పృహ తప్పి పడిపోయారు. వీరిని స్థానిక వలంటీర్ సేవకులు క్యూలో నుంచి బయటకు తీసుకొచ్చి ప్రాథమిక చికిత్స అందించారు. ఓ దశలో జరిగిన తొక్కిసలాటతో భక్తులకు అసౌకర్యం నెలకొంది.

అమ్మవారి సేవలో ప్రముఖులు

అమ్మవారి జాతరలో పలువురు ప్రముఖులు, అధికారులు పోలేరమ్మతల్లిని దర్శించున్నారు. వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, స్థానిక ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, కోవూరు, సర్వేపల్లి ఎమ్మెల్యేలు వేమిరెడ్డి ప్రశాంతి, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, నెల్లూరు కార్పొరేషన్ వైస్ చైర్మన్ రూప్‌కుమార్‌యాదవ్, మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, గంగాప్రసాద్, వెంపటి మాధవనాయుడు, శ్రీనివాసులు, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ జి ఢిల్లీబాబు, నక్కా వెంకటేశ్వర్లు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.



గండదీపం తీసుకెళుతున్న జాతర నిర్వాహకులు




బలి కత్తిని తీసుకుపోతున్న నిర్వాహకులు

రాయల వైభవం.. వెలుగుల సౌరభం

కుందేళ్లు..కుక్కలను తరిమిన గడ్డ.. రత్నాలు రాసులు పోసి, విక్రయించిన రతనాల సీమను ఏలిన వైభవం రాయలవారిది. ఆలనాటి చక్రవర్తులున్న కోట నాటి ప్రాభవం కోల్పోకుండా పర్యాటకధామంగా తీర్చిదిద్దడంలో భాగంగా నేడు వెలుగుల సౌరభం చేకూరింది. చంద్రగిరి కోటలో గతంలో కాలిపోయిన సౌండ్ అండ్ లైటింగ్ షోను నాటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పునరుద్ధరించింది. ఆ అధునాతన సౌకర్యాన్ని తాజాగా సీఎం చంద్రబాబు ప్రారంభించనున్నారు.

- పునఃప్రారంభం కానున్న సౌండ్ అండ్ లైటింగ్ షో
- గత ప్రభుత్వం చొరవతో పనులు ప్రారంభం
- తాజాగా 27న సీఎం చంద్రబాబు చేతుల మీదుగా వర్చువల్ విధానంలో ప్రారంభం

చంద్రగిరి: రాయలసీమకు తలమానికంగా నిలిచిన శ్రీకృష్ణదేవ రాయల కోటకు మహర్దశ పట్టింది. ఆగిపోయిన సౌండ్ అండ్ లైటింగ్ షో పునఃప్రారంభం కానుండడంతో పర్యాటకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇందుకు కావాల్సిన ఏర్పాట్లు ఇప్పటికే పూర్తి కావడంతో ఈ నెల 27 నుంచి పర్యాటకులకు అందుబాటులోకి తీసుకురావడానికి ఏపీ టూరిజంతోపాటు ఆర్కియాలజీ శాఖ అధికారులు సన్నద్ధం చేస్తున్నారు.



ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా కాంతులీనుతున్న రాయవారికోట(ఫైల్)

సుమారు రూ.6 కోట్లతో పనులు ప్రారంభం

రాయలవారి కోటలో ప్రతి రోజు సాయంత్రం రెండు షోలను నిర్వహించేలా చర్యలు తీసుకున్నారు. పిడుగుపాటుకు దెబ్బతిన్న వ్యవస్థను పూర్తిగా మార్చేసి అధునాత టెక్నాలజీ ద్వారా లక్స్ అండ్ డెసిబ్లెస్ సంస్థ సుమారు రూ.6 కోట్ల వ్యయంతో నూతన లైటింగ్ షోను పూర్తి చేసింది. వీటితో పాటు ఉదయం నుంచి సాయంత్రం వరకు కోనేరు బోటింగ్, లైటింగ్ షో సమయంలో పర్యాటకుల సౌకర్యార్థం ఫుడ్ కోర్టును కూడా అందుబాటులోకి తీసుకురానున్నారు.

పీపీపీ పద్ధతిలో నిర్వహణ

చెన్నైకు చెందిన లక్స్ అండ్ డెసిబ్లెస్ సంస్థ లైటింగ్ షోను ఆధునీకరించేందుకు ముందుకు రావడంతో గత ప్రభుత్వం ఆ సంస్థతో పబ్లిక్ ప్రైవేటు పార్టనర్‌షిప్(పీపీపీ) పద్ధతితో 10 ఏళ్ల పాటు ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలుస్తోంది. మరమ్మతులకు అవసరమైన రూ.6 కోట్ల పెట్టుబడిన ఆ సంస్థ పెట్టగా, అందులో వచ్చే ఆదాయంలో 60 శాతం సంస్థకు, 40 శాతం పర్యాటకశాఖకు వాటాలు వచ్చేలా ఒప్పందంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లుగా తెలుస్తోంది. ఎల్ఈడీ లైట్లు, అధునాతన సాంకేతికతను ఇందులో జోడించి షోను తిలకించేందుకు వచ్చే పర్యాటకులకు ఆకట్టుకునే రీతిలో వీటిని తీర్చిదిద్దినట్లు అధికారులు తెలిపారు.

గత ప్రభుత్వం చొరవతో పనులు ప్రారంభం



కోట ముందు ఏర్పాటు చేసిన ఎల్ఈడీ లైట్లు

2018లో పిడుగుపాటుకు దెబ్బతిన్న సౌండ్ అండ్ లైటింగ్ వ్యవస్థను అప్పటి టీడీపీ ప్రభుత్వం తిరిగి ప్రారంభించడంలో నిర్లక్ష్యం వహించింది. దీంతో 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పనులను చేపట్టేందుకు ప్రయత్నించింది. అయితే ఆర్కియాలజీ కేంద్రం పరిధిలో ఉండటంతో అనుమతులు ఆలస్యం అవుతూ వచ్చాయి. ఈ క్రమంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి ఈ విషయం తీసుకెళ్లారు. ఈ క్రమంలో 5 నెలల క్రితం పర్యాటకుల సౌకర్యార్థం రాయలకోటలో సౌండ్ అండ్ లైటింగ్ షో, బోటింగ్, ఫుడ్ కోర్టుల ఏర్పాటు కోసం అనుమతులు మంజూరు అయ్యాయి. ఈ మేరకు చెన్నైకు చెందిన లక్స్ అండ్ డెసిబ్లెస్ అనే ఓ ప్రైవేటు సంస్థతో అప్పటి ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది.

ఎన్నికల కోడ్‌తో మందకొడిగా పనులు

గత ప్రభుత్వంలో రాయలవారికోటలో సౌండ్ అండ్ లైటింగ్ షో పనులు దాదాపు పూర్తికావచ్చాయి. పనులు పూర్తి కానున్న నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో కొంత మందకొడిగా సాగాయి. అప్పటి ప్రభుత్వం ఎన్నికల్లోకి వెళ్లింది. కోడ్ ముగిసి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చే క్రమంలో పనులు కూడా పూర్తి అయ్యాయి. ఈ క్రమంలో సీఎం చంద్రబాబు ప్రభుత్వం వాటిని ప్రారంభించేందుకు ముహూర్తం ఖరారు చేసింది. ఈ నెల 27వ తేదీన వర్చువల్ విధానంలో సీఎం రాయలవారి కోట లైటింగ్ షోను ప్రారంభించనున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు.

ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో మాలి దేశ బృందం



సూర్యమండలం మోడల్‌ను పరిశీలిస్తున్న మాలి దేశ బృందం

రామచంద్రాపురం: మండలంలోని సి.కాశేపల్లి, టీవీ సపార్లు గ్రామాల్లోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను మాలి దేశ బృందం గురువారం పరిశీలించింది. ఈ సందర్భంగా సూర్య మండలం పద్ధతి, జీవామృతం, బీజామృతం గురించి ఆ బృందం సభ్యులు అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలోనే సి.రామాపురంలోని రామాలయం వద్ద మహిళా సంఘాల సభ్యులతో సమావేశం నిర్వహించారు. కంద, చామగడ్డ పొలాలను సందర్శించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ డీపీఎం షణ్ముగం మాట్లాడుతూ సి.రామాపురంలోని 30 మహిళా సంఘాల్లో 298 మంది సభ్యులు ఉన్నారని, ఇందులో 90 మంది రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారని తెలిపారు.



తిరుపతి బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు రూ.77,970

22 క్యారెట్లు ఒక గ్రాము రూ.7,074

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో) రూ.94,400

రిటైల్ వెండి గ్రాము రూ.97.40

క్లుప్తంగా

మళ్లీ అక్రమకట్టడాల కూల్చివేత

ఏర్పేడు: మండలంలోని వికృతమాలలో కాలువ పోరంబోకు భూముల్లో నిర్మించిన అక్రమ కట్టడాలను గురువారం రెండో పర్యాయం రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. ఆర్‌ఐ నల్లయ్య కథనం మేరకు.. వికృతమాల రెవెన్యూ సర్వే నంబరు 51లో 18.80 ఎకరాల కాలువ పోరంబోకు ఒరవ కాలువ భూమి ఉంది. స్థానికులు దాన్ని పూడ్చివేసి పక్కాగృహాలు నిర్మించుకున్నారు. గత నెలలో కట్టడాల యజమానులకు నోటీసులు జారీ చేశారు. ఈ నెల 18న ఒక పక్కా గృహం, ఒక హెయిర్ సెలూన్ బంకు, చిల్లర దుకాణం గుడిసెను కూల్చివేశారు. గురువారం మరో 4 పక్కా గృహాలను జేసీబీలతో కూల్చివేశారు.

ఐదుగురికి రిమాండ్

తిరుపతి లీగల్: బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో తిరుపతి, జీవకోన, క్రాంతి నగర్, ఆర్టీసీ కాలనీకి చెందిన బి శ్యామ్‌ప్రసాద్‌కు అక్టోబర్ మూడో తేదీ వరకు రిమాండ్ విధిస్తూ తిరుపతి నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్ బుధవారం రాత్రి ఆదేశాలు జారీ చేశారు. బాధితురాలు తల్లి ఫిర్యాదు మేరకు అలిపిరి పోలీసులు నిందితుడు శ్యామ్ ప్రసాద్‌ను అరెస్ట్ చేసి, న్యాయమూర్తి వద్ద హాజరు పరిచారు. అలాగే పేలుడు వస్తువులు కలిగిన కేసులో ఉత్తరప్రదేశ్, లలిత్పూర్ జిల్లాకు చెందిన బి కిషోర్, ఆనంద్, నరేంద్ర, కలికిరికి చెందిన సురేష్‌కు అక్టోబర్ 9వ తేదీ వరకు రిమాండ్ విధిస్తూ న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు.

సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల్లో అప్పులు చేసి విద్యార్థుల ఆకలి తీర్చే పరిస్థితి నెలకొంది. కొన్ని నెలలుగా బిల్లులు అందడం లేదు. ఫలితంగా వార్డెన్‌లపై అప్పుల భారం పెరుగుతోంది. వంటలో నాణ్యత అధ్వానంగా మారుతోంది. దీనికితోడు కూరగాయల ధరల పెరుగుదల భోజనంపై ప్రభావం చూపుతోంది. హాస్టళ్లో వడ్డించే భోజనం విద్యార్థులకు మింగుడు పడడం లేదు. వసతి గృహాల్లో అందించే భోజనంపై తల్లిదండ్రుల్లో సైతం ఆందోళన వ్యక్తమవుతోంది. బిల్లులు మంజూరు చేయాలని వార్డెన్లు వేడుకుంటున్నా ప్రభుత్వం స్పందించడం లేదు.



హాస్టళ్లలో అప్పుల వడ్డన



- వసతి గృహాలకు మంజూరు కాని బిల్లులు
- వార్డెన్‌లకు వడ్డింపు కష్టాలు
- మరోవైపు పెరిగిన ధరల ప్రభావం
- విద్యార్థులను పట్టించుకోని ప్రభుత్వం

సాంఘిక సంక్షేమ వసతి గృహాల వివరాలు

చిత్తూరు జిల్లాలో వసతి గృహాల సంఖ్య 57	విద్యార్థుల సంఖ్య 3,419
తిరుపతి జిల్లాలో వసతి గృహాల సంఖ్య 62	విద్యార్థుల సంఖ్య 5,300
మెనూ చార్జీల బిల్లుల బకాయిలు రూ. 2.50 లక్షలకు పైగా	

ఇతర వివరాలు

ప్రతి నెలా అవసరమయ్యే గ్యాస్ సిలిండర్లు 820	
రోజుకు బియ్యం 4వేల కిలోలు	కూరగాయలు 1200 కిలోలు
చికెన్ (ఒక్కరోజుకు గాను) 830 కేజీలు (వారంలో మూడు రోజులు)	గుడ్లు (ఒక్కరోజుకు గాను) 8719 (ఆరు రోజులు)
పాలు 830 లీటర్లు (రోజూ)	

పూతలపట్టు: చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో సాంఘిక సంక్షేమ శాఖకు సంబంధించి 119 వసతి గృహాలు ఉన్నాయి. ఈ గృహాల్లో 8,719 మంది విద్యార్థులు ఆశ్రయం పొందుతున్నారు. వీరికి ప్రభుత్వం ప్రత్యేకంగా మెనూ కేటాయించి ఆ ప్రకారం భోజనం వడ్డిస్తుంది. ఈ క్రమంలో సివిల్ సప్లయ్స్ నుంచి రేషన్ బియ్యం వసతి గృహాలకు సరఫరా అవుతుంది. ఇందుకు ప్రభుత్వం సివిల్ సప్లయ్స్‌కు కిలోకు రూ.1 చొప్పున చెల్లిస్తుంది. నెలవారీగా కిరాణా సరుకులు కాంట్రాక్ట్ తీసుకున్న వారి నుంచి సరఫరా అవుతుంది. వారి నుంచి నెలకు సరిపడా 18 రకాల సరుకులు నేరుగా వసతి గృహాలకు చేరుతాయి. పాలు, గుడ్లు, కూరగాయలు, చికెన్, వంటగ్యాస్ తదితరాలను విద్యార్థుల మెనూ చార్జీల ద్వారా నడిపిస్తుంటారు. ఈ చార్జీలను ఆయా వసతి గృహాల వార్డెన్లు భరిస్తుంటారు. అయితే మెనూ బిల్లులు సకాలంలో అందక భోజన వడ్డింపులో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. బిల్లులు రాక వార్డెన్‌లపై అప్పుల భారం పడుతోంది.

కూరగాయల ధరల ప్రభావం

గత కొన్ని రోజులుగా కూరగాయల ధరలు ఆకాశన్నంటుతున్నాయి. ప్రధానంగా తెల్లగడ్డ కిలో ధర రూ.340 నుంచి రూ.400వరకు పలుకుతోంది. అల్లం రూ.170 ఉంది. ఉల్లి కిలో రూ. 50 నుంచి రూ.70 వరకు విక్రయిస్తున్నారు. టమాటా కిలో రూ. 35 నుంచి రూ.50 వరకు అమ్ముడుపోతోంది. పచ్చి మిరప కేజీ రూ. 60కు విక్రయిస్తున్నారు. ఈ ధర దెబ్బకు వసతి గృహాల విద్యార్థులకు రుచికరమైన, నాణ్యమైన భోజనం అందడంలేదు. ఇచ్చే మెనూ చార్జీలకు, పెరిగిన కూరగాయల ధరలకు పొంతన లేదని, ఇలాగైతే నిర్వహణ కష్టమని వార్డెన్‌లు వాపోతున్నారు.

అప్పులు ఇలా...

ఈ ఏడాది జనవరి వరకూ గత ప్రభుత్వం బిల్లులు మంజూరు చేసింది. ఫిబ్రవరి నెల నుంచి ఇప్పటి వరకు బిల్లులు రావాల్సి ఉంది. ఆ పెండింగ్ బిల్లులు వార్డెన్లకు అప్పులను తెచ్చిపెడుతున్నాయి. అప్పులు చేసి విద్యార్థులకు భోజనం వండిపెడుతున్నారు. అప్పులు కూడా తలకు మించిన భారం కావడంతో ఏం చేయాలో తెలియక తికమక పడిపోతున్నారు. ఆరు నెలలకు గాను రూ.2.50 లక్షలకుపైగా మెనూ చార్జీ బిల్లులు చెల్లించాల్సి ఉందని వసతి గృహాల వార్డెన్‌లు ఇబ్బందులకు గురవుతున్నారు.

కానరాని నిర్వహణ నిధులు

వసతి గృహాల నిర్వహణ నిధులను ప్రభుత్వం మంజూరు చేయడం లేదు. దీంతో విద్యుత్ బల్బులు, మరుగు, మూత్రశాలల నిర్వహణ, చిన్నపాటి కిటికీలు, తలుపుల మరమ్మతులకు సొంత సొమ్మును వార్డెన్లు వెచ్చించాల్సి వస్తోంది. హాస్టల్ నిర్వహణకు ప్రతి నెలా కనీసం రూ.3 వేలు నుంచి రూ.5 వేల వరకూ ఖర్చు పెట్టాల్సి వస్తున్నట్లు వార్డెన్లు చెబుతున్నారు. మంజూరు కాని బిల్లులు విషయమై జిల్లా ఉన్నతాధికారికి వార్డెన్లు తమ బాధను చెప్పినా, నిధులు రావాలని, ప్రభుత్వం ఇంకా బిల్లులు మంజూరు చేయలేదని చెబుతున్నారు. దీంతో తమ పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని వార్డెన్లు వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి వసతి గృహాలకు సకాలంలో బిల్లులు మంజూరు చేయాలని వేడుకుంటున్నారు.

మెనూ చార్జీలు ఇలా..

సాధారణ వసతి గృహంలో ఒక్కో విద్యార్థికి ప్రభుత్వం రోజుకూ రూ.46, కళాశాల వసతి గృహాల్లో ఒక్కో విద్యార్థికి భోజన ఖర్చులకుగాను రూ.53 చెల్లిస్తుంది. ఈ కేటాయింపులతో నెలకు సాధారణ వసతి గృహంలో ఒక్కో విద్యార్థికి రూ.1,400, కళాశాల విద్యార్థికి రూ.1,600 చెల్లిస్తుంది. ఈ లెక్కన మెనూ ప్రకారం వారానికి ఆరు కోడి గుడ్లు, ప్రతి ఆదివారం బిరియాని, అరటి పండ్లు, పాలు, కూరగాయలతో కూడిన ఆహారం అందించాల్సి ఉంది. అయితే బిల్లుల చెల్లింపులో జాప్యం చోటు చేసుకోవడంతో విద్యార్థులకు సరైన భోజనం అందించడం లేదని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పి.కొత్తకోట ఎస్సీ ప్రభుత్వ వసతి గృహం

త్వరలో బిల్లులు మంజూరు అయ్యేలా చూస్తాం

ఎస్సీ వసతి గృహాల నిర్వహణకు సంబంధించి ఆరు నెలల బిల్లులు చెల్లించాల్సి ఉంది. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. మరో వారం రోజుల్లో బిల్లులు మంజూరవుతాయని తెలిసింది. ఈ మేరకు విద్యార్థులకు భోజనం వడ్డింపులో ఇబ్బందులు లేకుండా చూస్తాం.

– రాజ్యలక్ష్మి, డీడీ, సాంఘిక సంక్షేమ శాఖ

4 కిలోల గంజాయి స్వాధీనం

నాయుడుపేటటౌన్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న వంతాల వెంకటరావు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని, అతని వద్ద బ్యాగులో తనిఖీ చేయగా 4 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు గురువారం సీఐ బాబి వెల్లడించారు. సీఐ కథనం మేరకు.. పట్టణంలోని బస్టాండ్ ప్రాంతంలో బుధవారం రాత్రి తనిఖీలు చేస్తుండగా బ్యాగుతో అనుమానాస్పదంగా రోడ్డు పక్కన నిల్చుని ఉండడంతో అతనిని అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో అతడి వద్ద ఉన్న బ్యాగులో 4 కిలోల గంజాయి ఉండగా స్వాధీనం చేసుకుని, అతడిని అరెస్టు చేశారు. నిందితుడు అల్లూరి సీతారామరాజు జిల్లా, పెద్ద బయలు మండలం, బల్లపురాయి గ్రామానికి చెందిన వంతల వెంటరావుగా గుర్తించట్లు సీఐ పేర్కొన్నారు. నిందితుడిని స్థానిక తహసీల్దార్ గీతావాణి ఎదుట హాజరుపరిచి, ఆమె ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, కోర్టుకు హాజరు పరచిన్నట్లు వెల్లడించారు.



నిందితుడి అరెస్టు చూపుతున్న సీఐ బాబి

చెక్కు బౌన్స్ కేసులో నిందితులకు జైలు

తిరుపతి లీగల్: రెండు వేర్వేరు చెక్కుబౌన్స్ కేసుల్లో నిందితులకు జైలుశిక్ష విధిస్తూ తిరుపతి మొదటి, మూడో అదనపు జూనియర్ సివిల్ జడ్జిలు గురువారం తీర్పు చెప్పారు. తిరుపతి కొర్ల గుంటకు చెందిన ఎస్. రమేష్‌బాబు పీకే లేఔట్‌కు చెందిన వై.సుగుణమ్మ వద్ద రూ.5 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. రూ.5 లక్షలకు చెక్కు ఆమెకు ఇచ్చాడు. చెక్కు బౌన్స్ కావడంతో రమేష్‌బాబుపై కోర్టులో చెక్ బౌన్స్ కేసు దాఖలు చేశారు. నిందితుడికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. మరో కేసులో.. ఏర్పేడు మండలం, పాపానాయుడు పేటకు చెందిన శ్రీవేంకటేశ్వర ఫర్టిలైజర్స్ యజమాని పి.రమేష్ నాయుడు రేణిగుంటకు చెందిన ఎస్. కరీముల్లా షరీఫ్ వద్ద రూ.5 లక్షలు, అదే ఏడాది మరో రూ.5 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. రూ.7 లక్షలకు చెక్కు, రూ.5 లక్షలకు మరో చెక్కును కరీముల్లా షరీఫ్‌కు ఇచ్చాడు. ఆ రెండు చెక్కులు బౌన్స్ కావడంతో రమేష్ నాయుడిపై చెక్ బౌన్స్ కేసు దాఖలు చేశాడు. నిందితుడు రమేష్ నాయుడికి ఏడాది జైలుశిక్ష విధిస్తూ గురువారం న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

ఇద్దరు ఆర్డీఓల బదిలీ

తిరుపతి అర్బన్: జిల్లాలో ఇద్దరు ఆర్డీఓలను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. శ్రీకాళహస్తి ఆర్డీఓగా పనిచేస్తున్న రవిశంకర్‌రెడ్డిని విజయవాడ ప్రధాన కార్యాలయంలో రిపోర్టు చేయమని ఆదేశించారు. ఆ స్థానంలో భానుప్రకాష్‌రెడ్డిని ఆర్డీఓగా నియమించారు. సూళ్లూరుపేట ఆర్డీఓ చంద్రమునిని విజయవాడ ప్రధాన కార్యాలయంలో రిపోర్టు చేయమని ఆదేశించారు. ఆయన స్థానంలో కృష్ణాజిల్లాలో పని చేస్తున్న కిరణ్మయిని నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే రవిశంకర్‌రెడ్డి తిరుపతికి ఇన్‌చార్జి ఆర్డీఓగా పనిచేస్తున్నారు. అయితే తిరుపతి ఆర్డీఓగా ఎవరినీ నియమించలేదు.

వాలీబాల్ జిల్లా జట్ల ఎంపిక



ఎంపికైన ఎస్‌జీఎఫ్ అండర్-19 బాలికల వాలీబాల్ జట్టు

తిరుపతి ఎడ్యుకేషన్ : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) అండర్-19 ఉమ్మడి చిత్తూరు జిల్లా బాలబాలికల జిల్లా జట్ల ఎంపిక పోటీలు గురువారం తిరుపతిలోని ఎస్వీయూ క్యాంపస్ స్కూల్ ఆవరణలో నిర్వహించారు. ఈ పోటీలకు ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి దాదాపు 130 మంది బాలబాలికలు హాజరయ్యారు. బాలబాలికలకు వేర్వేరుగా ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. వీరిలో ప్రతిభ కనబరిచిన బాలుర విభాగంలో 15 మంది, బాలికల విభాగంలో 15 మందిని జిల్లా జట్లకు ఎంపిక చేశారు. ఎంపికైన బాలబాలికల జిల్లా జట్లు కృష్ణా జిల్లాలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-19వాలీబాల్ పోటీలకు జిల్లా తరఫున పాల్గొంటారని ఎస్‌జీఎఫ్ అండర్-19 కార్యదర్శి ఎస్. జయరామయ్య తెలిపారు. ఎంపికైన ఆయా జట్టు సభ్యులను ఎస్వీయూ క్యాంపస్ స్కూల్ హెచ్‌ఎం సభీనమ్మ, కె.షణ్ముగం, పి.శ్రీనివాసులు, పి.ప్రశాంత్ బాబు, పీడీలు, పీఈటీలు అభినందించారు.

బాలుర జట్టు: ఎం.యోగేష్‌రెడ్డి, కె.సన్ని, డి.మాధవ్, జి.జాన్సన్, పి.జశ్వంత్, కె.జీవ, ఆర్.హేమంత్‌కుమార్, ఎ.ఇమ్మానుయెల్, పి.గణేష్, ఎం.చరణ్‌తేజ, కె.ఉదయ్‌కిరణ్, ఎం.చైతన్యశ్రీరామ్, పి.రాజ, ఎ.లోహిత్, జి.తేజ ఎంపికయ్యారు.

బాలికల జట్టు: ఎ.పల్లివి, కె.రెడ్డికౌశల్య, ఎ.రాజేశ్వరి, ఎం.అశ్విని, ఎం.కల్యాణశాంతి, సి.అనూష, కె.సుమన్యశ్రిక, ఎస్.వైష్ణవి, కె.త్రినయని, జి.మానస, పి.రేణుకాబాయి, బి.బేబి, బి.ఈశ్వరికుమారి, జి.సునీత, సి.విజయప్రణీత ఎంపికయ్యారు.

రూ.కోటికి వ్యాపారి ఐపీ

తిరుపతి లీగల్: తిరుపతి, ఆర్సీరోడ్డుకు చెందిన వి.సురేంద్రన్ తిరుపతి అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో కోటి ఒక లక్ష 89 వేల రూపాయలకు ఐపీ దాఖలు చేసినట్టు ఆయన తరఫు న్యాయవాది ఇరుగు సురేంద్ర తెలిపారు. పిటిషన్‌లోని వివరాల మేరకు.... పిటిషనర్ నరేంద్రన్ తిరుపతి, అవిలాల, చెన్నప్ప కాలనీలో శ్రీ వినాయక ప్రొవిజన్స్ స్టోర్స్ పేరుతో రెండేళ్లుగా వ్యాపారం నిర్వహిస్తున్నాడు. ఇతరుల దగ్గర సొమ్ము రుణంగా తీసుకొని అతను వ్యాపారాన్ని ప్రారంభించాడు. వ్యాపారంలో పోటీ పెరగడంతో వ్యాపారాభివృద్ధి కోసం మరికొంత మంది వద్ద అతను నగదు వడ్డీలకు అప్పుగా తీసుకున్నాడు. అయినా నష్టాలు రావడంతో మరికొంత మంది వద్ద రూ.పది వడ్డీతో సొమ్మును అప్పుగా తీసుకొని ఖాళీ ప్రోనోట్లు, ఖాళీ చెక్కుల్లో సంతకాలు చేసి వారికి ఇచ్చాడు. వ్యాపారంలో తీవ్ర నష్టాలు రావడం రోజు రోజుకు రుణదాతల వేధింపులు ఎక్కువ కావడంతో సొమ్ము చెల్లించలేని స్థితిలో ఐపీ దాఖలు చేస్తున్నట్టు ఆయన పిటిషన్‌లో పేర్కొన్నాడు. 18 మంది రుణదాతలను ఆయన పిటిషన్‌లో ప్రతివాదులుగా పేర్కొన్నాడు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

పెళ్లకూరు: నాయుడుపేట-పూతలపట్టు జాతీయ రహదారిలో గురువారం తెల్లవారు జామున చిల్లకూరు గ్రామం వద్ద ఆగి ఉన్న లారీని అదే మార్గంలో వెళ్లే మరో లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో క్లీనర్ కార్తిక్(17) మృతి చెందగా డ్రైవర్‌కి గాయాలయ్యాయి. స్థానిక ఎస్‌ఐ నాగరాజు కథనం మేరకు.. శ్రీకాళహస్తి నుంచి విజయవాడకు వెళుతున్న లారీ మార్గం మధ్యలో చిల్లకూరు ఫ్లైఓవర్ వద్ద అదే మార్గంలో ఆగిఉన్న మరో లారీని ఢీకొంది. ఈ ఘటనలో కృష్ణా జిల్లా, మైలవరం ప్రాంతానికి చెందిన క్లీనర్ కార్తిక్ అక్కడికక్కడే మృతి చెందాడు. గాయపడిన డ్రైవర్‌ను నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ నాగరాజు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

వెటర్నరీ కళాశాలలో స్వచ్ఛతా హీ సేవ



పశువైద్యశాల ఆవరణలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

తిరుపతి సిటీ: వెటర్నరీ కళాశాల ఆధ్వర్యంలో స్థానిక పట్టణ పశువైద్యశాల పరిసరప్రాంతాల్లో విద్యార్థులు, సిబ్బంది గురువారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా వైద్యశాల ఆవరణలోని వ్యర్థాలను తొలగించి శుభ్రపరిచారు. పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు పట్టణ పశువైద్యశాల నుంచి తుడా కార్యాలయం వరకు ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ డీన్ డాక్టర్ జగపతిరామయ్య, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు శ్రీనివాసరావు, అమరావతి, రాజా, వెంకటేశర్లు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే పద్మావతి మహిళా వర్సిటీలో తిరుపతి నగరపాలక సంస్థ, వర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో గురువారం స్వచ్ఛత హీ సేవా కార్యక్రమం నిర్వహించి వర్సిటీ ప్రాంగణంలోని వ్యర్థాలను తొగించారు.

కోర్టు ఆవరణలో..

తిరుపతి లీగల్: స్థానిక కోర్టు ఆవరణలో గురువారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతి మూడో అదనపు జిల్లా జడ్జి ఎం.గురునాథ్ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారన్నారు. మన ఇళ్లను ఎలా పరిశుభ్రంగా ఉంచుకుంటామో.. మన కార్యాలయాలను అలాగే శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఉన్నత న్యాయస్థానాలు, కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు న్యాయమూర్తి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా జడ్జిలు రామ్‌గోపాల్, రామచంద్రుడు, అర్చన, సీనియర్ సివిల్ జడ్జిలు విజయరామరాజు, సునీత రాణి, జూనియర్ సివిల్ జడ్జిలు వాణిశ్రీ , సంధ్యారాణి, సరిత, కోటేశ్వరరావు, గ్రంధి శ్రీనివాస్, సత్యకుమార్, తిరుపతి న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు గోపీచంద్, ప్రధాన కార్యదర్శి మార్టిన్, పలువురు న్యాయవాదులు, వివిధ కోర్టుల సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

దొరవారిసత్రం: ఓ గుర్తు తెలియని వ్యక్తి జాతీయ రహదారి పక్కనే మృతి చెందిన ఘటన నెలబల్లి సమీపంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. రెండు రోజులగా నెల్లబల్లి గ్రామ పరిధిలో మతిస్థిమితం లేకుండా గుర్తుతెలియని వ్యక్తి తిరుగుతున్నాడు. అతడు గురువారం ఉదయం రోడ్డు పక్కనే పడిపోయి మృతి చెంది ఉండగా స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. స్థానిక పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి వయస్సు 35-40 మధ్య ఉండవచ్చని తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

అమ్మకానికి రేణిగుంట హిందూ శ్మశానవాటిక

- గ్రామసభ ఆమోదం కోసం పంచాయతీ పెద్దలు

రేణిగుంట: పట్టణంలో సగటు మనిషి చివరి మజిలీకి ఇకపై పంచాయతీ అధికారులు లెక్కకట్టనున్నారు. ఊపిరున్నంత కాలం డబ్బు చుట్టూ పరుగులు తీసే మనిషి జీవితం.. చనిపోయిన తర్వాత కూడా భారం కానుంది. రేణిగుంటలోని హిందూ శ్మశాన వాటికలో సమాధి కట్టాలంటే ఇకపై పంచాయతీకి రూ.లక్ష డిపాజిట్ చేయాలని, దాన్ని గ్రామ సభలో పెట్టి తీర్మానించిందుకు పంచాయతీ పెద్దలు అజెండాలో చేర్చడంపై పలువురు పట్టణవాసులు పెదవి విరుస్తున్నారు. రేణిగుంట పట్టణంలో బాలుర ఉన్నత పాఠశాల సమీపంలో హిందూ శ్మశాన వాటిక ఉంది. అక్కడ హిందువుల అంత్యక్రియలు జరుగుతాయి. ఎవరైనా సమాధులు కట్టుకోవాలంటే నామమాత్రపు రుసుము పంచాయతీ అధికారులకు చెల్లించి, వారి అనుమతి తీసుకుని సమాధులు కట్టుకునే పరిస్థితి ఉండేది. దీంతో సామాన్యులు కూడా తమవారికి సమాధులు కట్టుకోవాలన్న ఆకాంక్షను నెరవేర్చుకునేవారు.

గ్రామసభ అజెండాలో చేర్చి..

పట్టణంలో శుక్రవారం జరగనున్న గ్రామసభ అజెండాలో శ్మశాన వాటిక అంశాన్ని 12వ అంశంగా చేర్చారు. రేణిగుంట మేజర్ పంచాయతీలోని హిందూ శ్మశాన వాటికలో చనిపోయిన వారికి సమాధులు కట్టుకునేందుకు పంచాయతీ ద్వారా సమాధికి అవసరమయ్యే స్థలాన్ని రూ.లక్షకు అమ్మేందుకు పంచాయతీ అధికారులు సిద్ధమవుతున్నారు. రేణిగుంట గ్రామంలో రోజురోజుకు జనాభా పెరుగుతున్న నేపథ్యంలో హిందూ శ్మశాన వాటిక ఒక్కటే ఉంది. హిందువులకు ఉండే ఒకే ఒక్క శ్మశానంలో సమాధులకు స్థలాన్ని అమ్మేస్తే డబ్బున్న మారాజులు రూ.లక్షలు పెట్టి స్థలాన్ని కొని, సమాధులు కట్టుకుంటారు. ఇలా కట్టుకుంటూ పోతే డబ్బు లేని పేదల పార్థివదేహాలను కనీసం పూడ్చి పెట్టేందుకు కూడా శ్మశానంలో స్థలం ఉండబోదని పలువురు కలత చెందుతున్నారు. శుక్రవారం జరగబోయే గ్రామ సభలో ఆమోదం పొంది వెనువెంటనే పంచాయతీ తీర్మానం చేసి, శ్మశానం అమ్మేందుకు శరవేగంగా పంచాయతీ పెద్దలు పావులు కదుపుతున్నారు. పంచాయతీలో ఉన్న బస్టాండ్, వారపు సంత, పంచాయతీ రూములు, మార్కెట్ ఇలా... సమృద్ధిగా ఆదాయం సమకూరుతుంది. అయితే అది సరిపోక, పంచాయతీ పెద్దలు చివరకు శ్మశానాన్ని అమ్ముకునే పరిస్థితికి రావడంపై పలువురు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఇదే అంశాన్ని గ్రామ సభలో లేవనెత్తేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.



రేణిగుంట హిందూ శ్మశాన వాటిక